క్లుప్తంగా

రీ సర్వేకు సహకరించాలి



గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీఓ దాసు

పాములపాడు: రీ సర్వేకు రైతులు సహకరించాలని ఆత్మకూరు ఆర్డీఓ దాసు అన్నారు. శుక్రవారం మండలంలోని వాడాల, బానుముక్కల గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలకు హాజరుఅయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష (రీ సర్వే) పథకంలో భాగంగా మూడో విడతలో ఇస్కాల, బానుముక్కల, బానకచెర్ల, మద్దూరు గ్రామాలు ఎంపికై నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా ప్రతి రైతుకు శాశ్వత భూ హక్కు పత్రాలు ఇస్తామన్నారు. ఇస్కాల, మద్దూరు గ్రామాల్లో వీఆర్వోలు గ్రామ సభలు నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ రత్నరాధిక, వాడాల సర్పంచు లత, వీఆర్ఓలు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో 80 శాతం ఉత్తీర్ణత

ఆత్మకూరు: పట్టణంలోని ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు 80 శాతం పైగా ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ వెంకటనరసయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీఎస్‌లో దీప్తి 9.08, బీజెడ్‌సీలో గులాబ్‌సోని 8.66, బీ కామ్(సీఏ) జాన్సన్ 8.40 జీపీఏతో టాపర్స్‌గా నిలిచారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి

ఆత్మకూరు: ప్రతి రైతు తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆత్మకూరు అర్బన్, సిద్ధాపురం గ్రామాల్లో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల బీమా, మద్దతు ధర, పంట నష్ట పరిహారం లాంటివి వర్తించాలంటే ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి అన్నారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బైరాపురం మహబూబ్‌బాషా, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై అన్నదాత ఆందోళన



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న రైతులు

పాములపాడు: వ్యవసాయ విద్యుత్ సమస్యల పై రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం మండలంలోని లింగాల, చెలిమిల్ల, ఇస్కాల గ్రామాలకు చెందిన రైతులు కర్నూలు – గుంటూరు ప్రధాన రహదారిపై సబ్‌స్టేషన్ ఎదురుగా దాదాపు 2 గంటల పాటు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి పగటి పూట 9 గంటల కరెంట్ సరఫరా చేయాలని చెబుతున్నా... విద్యుత్ శాఖ అధికారులు అనధికార కోతల విధిస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏడీ వసంతయ్య సబ్‌స్టేషన్‌కు చేరుకొని రైతులతో మాట్లాడారు. విశాఖపట్నంలో తలెత్తిన సమస్య వల్ల కొంత మేర సమస్య ఏర్పడిందన్నారు. ప్రస్తుతం అక్కడ పరిష్కారమైందని, ఇకపై ఎప్పటిలాగే విద్యుత్ సరఫరా ఉంటుందని చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు.

భూ రీసర్వేను సద్వినియోగం చేసుకోండి

కొలతలు: గ్రామాల్లో భూముల రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు రైతులకు సూచించారు. శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న శివపురం గ్రా మంలో, ఆర్ఐ జహంగీర్ బాషా ఆధ్వర్యంలో కొత్తపల్లిలో భూముల రీసర్వేపై రైతులకు గ్రామసభ నిర్వహించారు. శివపురం సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, వీఆర్వోలు బాబు మియా, లింగేష్ పాల్గొన్నారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి

వెలుగోడు: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఎం నాయకుడు కే.రామదాస్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని సచివాలయాల వద్ద అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా రామదాస్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు, పెట్రోల్, డీజిల్ ధరలు, నిత్యవసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు నాగమోహన్, జిల్లా అవాజ్ నాయకులు మహ్మద్ రఫీ, నాయకులు ఇస్మాయిల్, మదార్ వలి, ఖాదర్ బాషా, లింగన్న, సుధాకర్, రహంతుల్లా, జి బాషా, నూరుల్లా, నాగరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

కేసీకి నీటిసరఫరా నిలిపివేత

జూపాడుబంగ్లా: ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాల నుంచి నీటిసరఫరా నిలిపివేయటంతో కేసీ కాల్వకు సాగునీటి సరఫరా నిలిచిపోయినట్లు కేసీ కాల్వ ఏఈ నరేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు 16 తేదీ నుంచి కేసీ కాల్వకు ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాల ద్వారా కేసీ కాల్వకు సాగునీటిని పక్షం రోజుల పాటు సరఫరా చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎత్తిపోతల పథకాల ద్వారా కేసీ కాల్వకు సాగునీటి సరఫరాను నిలిపివేసినట్లు తెలిపారు. రైతులు డిమాండ్ చేస్తే కేసీ కాల్వకు సాగునీటి సరఫరా విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఏఈ నరేష్ తెలిపారు.



పాములపాడు మండలం ఇస్కాలలో మహిళలకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎంపీడీఓ గోపీకృష్ణ



కొత్తపల్లి మండలం గువ్వలకుంట్లలో పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం



మిడుతూరు: మహిళకు నూతన పెన్షన్ అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి



పగిడ్యాల: మహిళకు పింఛన్ అందజేస్తున్న జెడ్పీటీసీ దివ్య, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న

పింఛన్లతో బతుకు భరోసా

- నియోజకవర్గంలో కొత్తగా 963 పింఛన్ల మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

అలసిన అవ్వతాతలకు.. తోడును కోల్పోయిన మహిళలకు.. విధివంచిత బడుగులకు, అణగారిన వృత్తి కళాకారులకు.. 'వైఎస్సార్ ఆసరా' ఆదెరువుగా నిలుస్తోంది. ఎన్నికల హామీకి కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్లు మంజూరు చేస్తూ పేదలకు పెద్ద కొడుకవుతున్నారు. శుక్రవారం నియోజకవర్గంలో 963 కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. పలు చోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమాలు చేపట్టడంతో గ్రామాల్లో పండుగా వాతావరణం నెలకొంది.

నందికొట్కూరు: పట్టణంలోని జైకిసాన్ పార్కులో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అందజేశారు. పింఛనర్లతో కలిసి సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు లాలు ప్రసాద్, చాంద్‌బాషా, రవూఫ్, అశోక్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో నూతన పింఛన్‌దారులకు ఎంపీడీఓ శోభారాణి పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రవీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేస్తోందని గోకవరం సర్పంచు కలబండి మారెన్న, ముసలిమడుగు సర్పంచు జమిలాబీ, గువ్వలకుంట్ల ఎంపీటీసీ సోమల స్రవంతి అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామవలంటీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పింఛన్లను పంపిణీ చేశారు. కాగా మండలంలో కొత్తగా 215 పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ మేరి తెలిపారు.

పాములపాడు: మండలంలో కొత్తగా మంజూరైన 156 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. మరో 146 పింఛన్లు వెరిఫికేషన్ దశలో ఉన్నాయన్నారు.

మిడుతూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మాసపేట గ్రామ సచివాలయంలో నూతన పిన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు, కుల, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్న ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమేనన్నారు.



నందికొట్కూర్‌లో సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న పెన్షన్‌దారులు

పగిడ్యాల: స్థానిక గ్రామ సచివాలయం–1లో కొత్తగా మంజూరైన పింఛన్లను జెడ్పీటీసీ పుల్యాల దివ్య, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న లబ్ధిదారులకు అందజేశారు. మండలానికి 123 కొత్త పింఛన్లు మంజూరు కావడం సంతోషకమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

జూపాడుబంగ్లా: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వైస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ వై.వెంకటరమణ, సర్పంచులు నాగార్జునరెడ్డి, మొట్టె బాలయ్య, కృపమ్మ తెలిపారు. కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. కాగా మండలం వ్యాప్తంగా ఈ నెల 95 మందికి నూతన పింఛన్లు మంజూరయ్యాయి. మరో 104 మంది దరఖాస్తులు పరిశీలనలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

మహానంది: మహానంది మండలంలో నూతనంగా 112 పింఛన్లు మంజూరైనట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. మరో 118 మంది దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. కాగా శుక్రవారం మొదటి రోజు మొత్తం 5,246 పింఛన్లకు గానూ 4,292 పింఛన్లు పంపిణీ చేశామన్నారు.

బండిఆత్మకూరు మండలంలో 120 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు. 15 సచివాలయాల పరిధిలో 120 పింఛన్లు మంజూరయ్యాయని, మరికొన్ని వెరిఫికేషన్ దశలో ఉన్నాయని తెలిపారు.

శ్రీశైలంప్రాజెక్ట్: మండలంలో కొత్తగా 121 పింఛన్లు మంజూరయ్యాయి. సాధువులు, సన్యాసులు, భిక్షకులు, అనాథలకు సైతం అర్హత ఆధారంగా పింఛన్లు మంజూరయ్యాయి. కర్నూలు జిల్లా డోన్‌కు చెందిన రఘునాథరావ్ దేశ్‌పాండే సన్యాసం స్వీకరించి 12 ఏళ్లుగా సున్నిపెంట ప్రాంతలో నివశిస్తున్నాడు. వలంటీర్ సయ్యద్ నబీరసూల్ అతనిని గుర్తించి వృద్ధాప్య పింఛన్‌కు దరఖాస్తు చేయించగా ప్రభుత్వం మంజూరు చేసింది. శుక్రవారం వలంటీర్ చేతుల మీదుగా రూ.2,750 అందుకున్నాడు.



జూపాడుబంగ్లా: మండ్లెంలో మహిళకు పింఛన్ అందజేస్తున్న వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, తదితరులు



మహానంది: పింఛన్ డబ్బు ఇస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్‌ను ప్రేమగా పలకరిస్తున్న పెద్దక్క

వలంటీర్ చెప్పగానే సంతోషమేసింది



పొద్దున వలంటీరు ఇంటి వద్దకు వచ్చి పింఛన్ మంజూరైందని చెప్పగానే సంతోషమేసింది. నాకు ముగ్గురు కూతుళ్లు కాగా పెళ్లిళ్లు చేసి పంపించాను. రోజువారి కూలీ పనులకు వెళ్లేవాన్ని. ఆటో ప్రమాదం జరిగి కాలు విరగడంతో పనులకు వెళ్లలేని స్థితిలో ఉన్నాను. నా భార్య ఆశాబీకి వచ్చే వికలాంగుల పింఛన్‌తోనే జీవనం గడిపేస్తున్నాం. గతంలో వృద్ధాప్య పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. ఇంక రాదులే అని నిరాశతోనే సచివాలయంలో మరోసారి దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పుడు పింఛన్ మంజూరైంది. పని చేతకాని మాకు పింఛన్ ఆసరా అవుతుంది.

– మాసుం, మండ్లెం

మాబోటి వాళ్లకు జగనన్నే అండ



ఏడాది క్రితం నా భర్త దేవభూషణం అనారోగ్యంతో మృతిచెందాడు. వ్యవసాయ పనులు చేస్తూ కొడుకుకు వివాహం చేశాను. మట్టిమిద్దెకు వారపాకు వేసుకొని అందులో నాకొడుకు, నేను జీవిస్తున్నాం. నాభర్త మరణించాక మా ఊరి గ్రామ సచివాలయంలో వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఆరు మాసాల్లోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ మంజూరు చేశాడు. పొద్దున వలంటీరు వచ్చి పింఛన్ సొమ్ము చేతిలో పెట్టడంతో ఆనందమేసింది. మాబోటి వాళ్లకు ముఖ్యమంత్రి జగనన్న అండగా ఉన్నాడనిపించింది.

– దానమ్మ, వితంతువు, పి.లింగాపురం

నేడు బుక్కాపురంలో వైఎస్సార్ వర్ధంతి

మహానంది: దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా బుక్కాపురంలోని రైతుభరోసా కేంద్రం వద్ద నివాళులర్పించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొమ్మా మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆర్‌బీకే వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించే కార్యక్రమానికి మండల నాయకులు, వైఎస్సార్ అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

కౌలు రైతులకు రైతు భరోసా సాయం

వెలుగోడు: మండంలో 178 మంది కౌలు రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా నగదు రూ. 13,35,000 వారి ఖాతాల్లో జమ అయినట్లు ఏడీఏ ఆంజనేయ తెలిపారు. శుక్రవారం సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి రైతు రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేసినట్లు ఏడీ వివరించారు. కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారంలో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది, అభ్యుదయ రైతులు, ప్రజా ప్రతినిధులు వీక్షించారు. అబ్దుల్లాపురం రైతు భరోసా కేంద్రానికి ఆత్మకూరు ఏడీ ఆంజనేయ హాజరై కియోస్క్ పనితీరు, ఎరువుల లభ్యత, ఈ పంట నమోదు పరిశీలించారు. ఆత్మకూరు సబ్ డివిజన్‌లో 1119 మంది కౌలు రైతులకు రూ.83.95 లక్షలు వైఎస్ఆర్ రైతు భరోసా సాయం అందినట్లు చెప్పారు. వేల్పనూరు రైతు భరోసా కేంద్రాన్ని ఏడీ తనిఖీ చేసి ఎరువుల లభ్యత, పంట నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో అంబసముద్రం ఎమ్మెల్యే పూజలు



విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే సుబయ్య

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో తమిళనాడు రాష్ట్ర న్యాయశాఖ మాజీ మంత్రి, తిరునవెల్లి జిల్లా అంబసముద్రం నియోజకవర్గ ఎమ్మెల్యే ఇసక్కి సుబయ్య కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి మహానందికి వచ్చారు. దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అన్నదాన కార్యక్రమానికి రూ.పదివేలు విరాళం అందించినట్లు ఈఓ తెలిపారు. వారి వెంట సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వర దంపతులు



పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో వెలిసిన మహానందీశ్వరస్వామి దంపతులకు శ్రావణమాసం, శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పండితులు, అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజల, హారతుల చేపట్టిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల భక్తులు పల్లకి మోస్తూ భక్తిశ్రద్ధలతో మహానందీశ్వర స్వామికీ జై...కామేశ్వరీదేవికి జై..అంటూ ప్రణమిల్లారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం

- కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి

నందికొట్కూరు: సమష్టి కృషితోనే సహకార సొసైటీ అభివృద్ధి సాధ్యమని కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సహకార బ్యాంకు ఆవరణలో వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలను ఆమె పంపిణీ చేశారు. కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా మెగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరి సహకారంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం జరిగిందన్నారు. జగనన్న ప్రభుత్వం రైతులకు అన్ని రకాల రాయితీలు అందిస్తుందన్నారు. రుణాలు సకాలంలో చెల్లించి సహకారం బ్యాంకు అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ ఏడాది రూ.2.50 కోట్ల రుణాలు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. 46 మంది కౌలు రైతుల ఖాతాలకు ప్రభుత్వం రూ.28.70 లక్షలు జమ చేసిందన్నారు. కార్యక్రమంలో సీఈఓ రామాంజనేయులు, ఏపీసీఓబీ జీఎం విజయకుమారి, డీజీఎం ఉమామహేశ్వరరెడ్డి, బ్యాంకు మేనేజర్ సరోజమ్మ, ఏజీఎం సుల్తానా, ఆయా సహకార సొసైటి అధ్యక్షులు వెంకటరమణ, లక్ష్మికాంతారెడ్డి, నాగతులసిరెడ్డి, రామచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, మెప్మా సీఎంఎం శాంతకుమారి, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.



కౌలు రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి

ఆకతాయిలకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో వివిధ కేసుల్లో అదుపులోనికి తీసుకున్న నిందితులకు సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్ష ఖరారు చేసినట్టు పోలీసు అధికారులు శుక్రవారం తెలిపారు. వివరాల మేరకు.. షేక్ హుస్సేన్‌వలి, షేక్ మహబూబ్‌బాషా స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద మద్యం మత్తులో ఒకరినొకరు అసభ్యంగా దూషించుకుంటూ ఘర్షణ పడడంతో వారిని టూటౌన్ పోలీసులు అదుపులోనికి తీసుకుని ఐపీసీ 160 కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి వారికి 4 రోజుల జైలు శిక్ష విధించారు. ఎన్‌జీవో కాలనీలో, టెక్కె శిల్పా సహకార్ వద్ద రోడ్డుపై వెళుతున్న మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న శీలం శివకృష్ణ, నాగరాజులను టూటౌన్ పోలీసులు ఐపీసీ 294 కింద చార్జి షీటు దాఖలు చేయగా వారికి జడ్జి 15 రోజులు జైలు శిక్ష విదించినట్లు తెలిపారు.



కృష్ణాజాలల నుంచి బయల్పడుతున్న ప్రాచీన సంగమేశ్వరాలయం

బయల్పడుతున్న సంగమేశ్వరాలయం

కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన సప్తనది సంగమేశ్వరాలయం రెండవ సారి పూర్తిగా బయల్పడనుంది. శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం క్రమేపీ తగ్గుముఖం పట్టి 885 అడుగుల నుంచి 851.9 అడుగులకు చేరుకుంది. దీంతో శుక్రవారం సాయంత్రానికి ఆలయం 14 అడుగుల మేర కృష్ణాజలాలపై కనువిందు చేస్తుంది. ఆలయ మండప పైభాగం బయటపడుతుంది. ఇలాగే నీటిమట్టం తగ్గుతూ పోతే త్వరలో పూర్తిగా ఆలయం బయటపడి భక్తులచే పూజలు అందుకోనుంది.

వర్షం కోసం ప్రార్థనలు



రేగడగూడూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

వెలుగోడు: వర్షాలు బాగా కురవాలని ముస్లింలు రేగడగూడూరు గ్రామంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా వర్షాలు కురవపోవడంతో జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కరువుచాయలు అలుముకున్నాయి. సాగు చేసిన పంటలు ఎండిపోవడంతో పనులు లేక వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ముస్లింలు వ్యవసాయ పొలంలో చేరి ప్రత్యేక ప్రార్థలు చేస్తూ అల్లాను వేడుకున్నారు.

అలరించిన భజన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణమాఢవీధిలోని నిత్యకళావేదికపై వికారాబాద్‌కు చెందిన సంఘమేశ్వర భజన మండలి వారిచే నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను అలరించింది. కైలాసవాసా గౌరివిలాసా, గిరిజజీవన శంకరా, శంభో శివశంభో, స్వామిరారా శివలింగ, శివహార పార్వతీ రమణ, అందాల అమ్మ భ్రమరాంబా రావమ్మా, కోరికలు తీర్చే కొండంత దైవము శంకరుడు మొదలైన పలు భక్తిగీతాలు, అష్టకాలు తదితర వాటిని మాణిక్‌రెడ్డి, కోదండము, మల్లేశం, కృష్ణయ్య, శ్రీశైలం, రవి, మల్లయ్య, కమిత తదితరులు ఆలాపించారు.



భక్తిగీతాలను ఆలపిస్తున్న కళాకారులు

తప్పిపోయిన బాలుడు తండ్రి చెంతకు

ఆత్మకూరు: రెండురోజుల క్రితం తప్పిపోయిన ఓ బాలుడిని పోలీసులు శుక్రవారం తండ్రి చెంతకు చేర్చారు. సీఐ నాగభూషణం తెలిపిన వివరాలు.. అనంతపురం జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన మోక్షిత్ రెడ్డి 9వ తరగతి చదువుతున్నాడు. ఇంట్లో రూ.140 కనిపించకపోవడంతో తండ్రి ప్రతాపరెడ్డి అనుమానంతో తీసుకున్నావా అంటూ మోక్షిత్‌రెడ్డిని అడిగాడు. ఈవిషయంలో మనస్తాపం చెందిన కుమారుడు.. ఇంట్లో చెప్పకుండా ధర్మవరం నుంచి రైలులో కర్నూలుకు చేరుకున్నాడు. అక్కడ ఓ వ్యక్తిని లిఫ్ట్ అడిగి స్కూటీపై ఆత్మకూరుకు వచ్చాడు. ఇది తమ ఊరు కాదని, ఇక్కడే దింపాలని కోరగా స్కూటరిస్ట్ అనుమానం వచ్చి పెట్రోలింగ్ హైవే పోలీసులుకు అప్పగించాడు. వారు సీఐ దృష్టికి తీసుకెళ్లగా విచారించి తండ్రిని పిలిపించి బాలుడిని అప్పగించారు.